క్లుప్తంగా

తెలంగాణ సీఎం నిధికి బొండాడ గ్రూప్ రూ.25లక్షల చెక్ అందజేత



అవనిగడ్డ: తెలంగాణ రాష్ట్రంలోని వరద బాధితులకు దివిసీమకు చెందిన బొండాడ గ్రూప్ సీఎండీ డాక్టర్ బొండాడ రాఘవేంద్రరావు రూ.25 లక్షలు ఆర్థిక సహాయం చేశారు. ఈ మేరకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలుసుకుని ఈ మొత్తంకు చెక్ అందించారు.

సత్వర న్యాయం కోసం కోర్టును ఆశ్రయించాలి

బంటుమిల్లి: పేద, బడుగు బలహీన వర్గాలు తమకు సత్వర న్యాయం కావాలంటే ఎటువంటి ఖర్చు లేకుండా స్థానిక కోర్టులలో నిర్వహించే మండల న్యాయ సేవాధికార కమిటీలను ఆశ్రయించాలని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కేవీ రామకృష్ణయ్య అన్నారు. స్థానిక సమగ్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ(ఐసీడీఎస్) శాఖ బంటుమిల్లి ప్రాజెక్టు కార్యాలయంలో శనివారం జాతీయ మహిళా కమిషన్, జాతీయ న్యాయ సేవాధికార సంస్థ సంయుక్తంగా మహిళా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. బంటుమిల్లి జూనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ కమిటీ చైర్మన్ ఎం.భాస్కరరావు సదస్సుకు అధ్యక్షత వహించారు. సదస్సులో జడ్జి రామకృష్ణయ్య సేవలను సత్వరం పొందడానికి ఉపయోగించే టోల్ ఫ్రీ నంబర్లపై అవగాహన కలిగించారు.

వరద బాధితులకు దుప్పట్లు, రగ్గుల పంపిణీ

కె.కొత్తపాలెం(మోపిదేవి): మండలంలోని కె.కొత్తపాలెం ఎస్సీకాలనీలో వరద బాధితులకు ఒంగోలుకు చెందిన పీస్ గాస్పెల్ మినిస్ట్రీస్ ఆఫ్ ఇండియా చైర్మన్ బుర్రె శ్యాంసన్ ఆధ్వర్యంలో శనివారం 200 కుటుంబాలకు దుప్పట్లు, రగ్గులు అందజేశారు. జనసేన పార్టీ మండల అధ్యక్షుడు పూషడపు రత్నగోపాల్, మత్తి వంశీకృష్ణ, మాజీ సర్పంచ్ పాలిమెట్ల వెంకటేశ్వరరావు, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ కొక్కిలిగడ్డ కమల పాల్గొన్నారు.

మోపిదేవి ఎంపీడీవోగా స్వర్ణభారతి బాధ్యతల స్వీకారం

మోపిదేవి: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా జె.స్వర్ణభారతి, మండల విస్తరణ అధికారిగా కమ్మిలి త్రిపుర సుందరి శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడే ఎంపీడీవోగా స్వర్ణభారతి పనిచేయగా, త్రిపుర సుందరి మోపిదేవి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేశారు. ఇరువురి అధికారులకు కార్యాలయం అధికారులు, సిబ్బంది సాదరంగా ఆహ్వానించారు.

నందిగామ సర్పంచ్‌కు సత్కారం



పెడన: కోర్టు ఉత్తర్వులతో పెడన మండలం నందిగామ సర్పంచ్‌గా బాధ్యతలను స్వీకరించిన బొడ్డు హరిబాబును వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గౌతమ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పాల రాము శనివారం ఘనంగా సత్కరించారు. పెడన వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గరికపాటి వెంకట రామానాయుడు, రాజులపాటి అచ్చుతరావు, గూడూరు ఎంపీపీ సంగా మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

కేడీసీసీబీ గూడూరు చీఫ్ మేనేజర్ బదిలీ

గూడూరు: కృష్ణా జిల్లా కేంద్ర సహకార బ్యాంకు గూడూరు శాఖ చీఫ్ మేనేజర్ పి.వి.శ్రీనివాసరావు బదిలీ అయ్యారు. శ్రీనివాసరావు గూడూరు నుంచి విజయవాడ సత్యనారాయణపురం శాఖకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా శనివారం మండలంలోని పీఏసీఎస్ సీఈఓలు ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో మేనేజర్ కె.వెంకయ్య, సూపర్‌వైజర్ వి.పూర్ణచంద్రరావు, సీఈవోలు ఎల్‌వీపీ చక్రవర్తి, టి.గణేష్, జి.శ్రీను, భువనేశ్వరరావు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నట్టేట ముంచిన ‘నకిలీ’

- రైతులకు అంటగడుతున్న దళారులు, ధాన్యం వ్యాపారులు
- మందు పిచికారీ చేసినా ఫలితం లేదని రైతుల ఆందోళన
- 20 నుంచి 60 ఎకరాల వరకు దోమపోటుకు గురైన వరి పంట
- తనిఖీలు నిల్..పర్యవేక్షణ శూన్యం ..పత్తా లేని అధికారులు



దోమపోటుకు అక్కడక్కడ మాడిపోతున్న వరిపైరు



దోమపోటుకు డొల్లగా మారిన కంకులను చూపుతున్న రైతు

పెడన: ప్రకృతి వైపరీత్యం నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న రైతులను నకిలీ పురుగు మందులు దొంగ దెబ్బతీశాయి. వ్యవసాయ శాఖాధికారులలో కొందరు మామూళ్ల మత్తులో పడి చూసీచూడనట్లుగా వ్యవహరించడం వల్ల ఎరువుల దుకాణదారులు, డీలర్లు, ధాన్యం కొనుగోలుదారులు రైతులను మోసం చేస్తున్నారు. మండలంలోని జింజేరు గ్రామంలో నకిలీ పురుగుమందులు హల్‌చల్ చేయడమే ఇందుకు నిదర్శనం.

గతంలో ఇలా...

గత వైఎస్సార్ సీపీ సర్కారులో నకిలీ పురుగుమందులు కనిపిస్తే కఠిన చర్యలు తీసుకునేవారు. రైతులకు ఏమైనా కావాలంటే రైతు భరోసా కేంద్రాల ద్వారా సరఫరా చేసేవారు. అగ్రి ల్యాబ్‌లు ఏర్పాటు చేసి రసాయన మందులను, ఎరువులను పరీక్షించిన తరువాతే రైతులకు చేరేవి.

ప్రస్తుతం ఇలా..

ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఎటువంటి పరీక్షలు చేయకుండానే కొందరు ఎరువుల దుకాణాల ద్వారా దళారులను, ధాన్యం వ్యాపారులను రంగంలోకి దించి నకిలీ పురుగు మందులను విక్రయించి రైతులను నట్టేట ముంచుతున్నారు. ఈ పరిస్థితిని అరికట్టాల్సిన అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు.

జరిగింది ఇదీ..



నకిలీ పురుగు మందు (ఫిక్సలాన్)

పెడన మండలం జింజేరు గ్రామంలో సుమారు పదుల సంఖ్యలో రైతులు పరిచయం ఉన్న ధాన్యం వ్యాపారి వద్ద ఫిక్సలాన్ మందును దోమపోటు నివారణ నిమిత్తం కొనుగోలు చేశారు. దీనికి రైతులకు రశీదులు ఇవ్వకుండా వారి పేరుతో ఖాతా పుస్తకంలో నమోదు చేసుకున్నాడు. దోమ పోటు అధికం కాకుండా ఉండేందుకు వరిపై ఈ మందును పిచికారీ చేశారు. మందు పనిచేయకపోవడంతో కొందరు రైతులకు అనుమానం వచ్చి పెడనలో ఎరువుల దుకాణాన్ని సంప్రదించారు. సంబంధిత కంపెనీ ఏజెంట్‌ను పిలిపించి ఫిక్సలాన్ డబ్బాను పరిశీలించి ఫోన్‌లోని కంపెనీ యాప్ ద్వారా స్కాన్ చేస్తే అది నకిలీదని తేలింది. ఇలా పలువురు రైతులు తాము మోసపోయామని గుర్తించి ధాన్యం వ్యాపారిని నిలదీయగా అతను కాస్త సమయం ఇవ్వాలని కోరాడు. ఎరువుల దుకాణాన్ని సంప్రదించి పరిస్థితి తెలియజేయడంతో రాజీయత్నాలు చేయడం, నకిలీ పురుగుమందుల విషయం బయటకు పొక్కనీయొద్దని, నష్ట పరిహారం ఇస్తామంటూ పేర్కొంటూ కాలయాపన చేస్తుండటంతో విషయం వెలుగుచూసింది.

రెండు ఎకరాల్లో పిచికారీ చేశా!



రెండు ఎకరాలు కౌలుకు తీసుకుని చేస్తున్నా. దోమపోటుకు స్థానిక ధాన్యం వ్యాపారి నుంచి ఫిక్సలాన్ మందు తీసుకుని పిచికారీ చేశా. మందు పనిచేయలేదు. పైరు పచ్చగా కనిపిస్తున్నా లోపలంతా డొల్లగా ఉంది. అధికారులకు చెబుదామని వెళ్తే ఎవరూ ఉండటం లేదు.

–ఎం.వీరబాబు, కౌలు రైతు, జింజేరు, పెడన మండలం

పది ఎకరాలకు కొని, రెండెకరాల్లో వాడా!



నాకు మొత్తం పది ఎకరాలు ఉంది. దోమ పోటుకు స్థానికంగా ఉన్న వ్యాపారి నుంచి ఫిక్సలాన్ మందును తీసుకుని ముందుగా రెండు ఎకరాల్లో పిచికారీ చేశా. పనిచేయకపోవడంతో మిగిలిన పొలానికి చల్లకుండా ఆపేశా. అదేమని ప్రశ్నిస్తే ఇదిగో అదిగో అంటూ కాలం గడిపేస్తున్నారు.

– కె.వేణుగోపాలరావు, రైతు, జింజేరు, పెడన మండలం

మా దృష్టికి రాలేదు.. పరిశీలిస్తాం

నకిలీ పురుగుమందులు వాడామని, అవి పనిచేయడం లేదని నా దృష్టికి ఎవరూ తీసుకురాలేదు. ఇప్పుడు మీరు చెప్పారు కాబట్టి తప్పకుండా వెళ్లి పరిశీలిస్తాం. ఆ రైతుల వివరాలుంటే మాకు తెలియజేయండి.

– నూరున్నీసా, ఇన్‌చార్జి ఏవో, పెడన మండలం

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

బందరు డీఎస్పీ అబ్దుల్ సుభాన్

కోనేరుసెంటర్: దసరా నవరాత్రులను పురస్కరించుకుని శక్తి పటాల నిర్వాహకులు పోలీసు నిబంధనలను తూచా తప్పక పాటించాలని బందరు డీఎస్పీ అబ్దుల్ సుభాన్ తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఆర్.పేట పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ శక్తిపటాల ఊరేగింపులో రెండు వర్గాల మధ్య కొట్లాట జరగ్గా కొట్లాటకు కారణమైన 17 మందిపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు. పోలీసుల షరతులకు కట్టుబడి ఊరేగింపులు జరుపుకోవాలని సూచించారు. డీజేలు, బాణసంచా, రికార్డింగ్ డ్యాన్స్‌లు, హిజ్రాల నృత్యాలు నిషిద్ధమన్నారు. ఊరేగింపుల్లో చెడు నడత కలిగిన వ్యక్తుల కదలికలపై పూర్తి నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో ఆర్.పేట సీఐ ఏసుబాబు పాల్గొన్నారు.

లౌకిక వాదాన్ని అవమానించిన పవన్‌కల్యాణ్

మచిలీపట్నంటౌన్: సనాతన ధర్మాన్ని కాపాడుతున్నానంటూ పేర్కొంటూనే రాష్ట్ర డెప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ లౌకికవాదాన్ని అవమానించారని దళిత బహుజన సాంస్కృతిక విజ్ఞాన వేదిక జిల్లా కమిటీ కన్వీనర్ ఎగ్గోని గాంధీ ఆరోపించారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. తిరుపతిలో జరిగిన బహిరంగ సభలో పవన్‌కల్యాణ్ సనాతన ధర్మంపై మాట్లాడుతూ ముస్లిం, క్రైస్తవులపై విద్వేషాన్ని వెళ్లగక్కేలా మాట్లాడారన్నారు. రాజ్యాంగ పీఠికలో ఉన్న సెక్యులర్ అనే పదాన్ని ఉద్దేశిస్తూ పవన్‌కల్యాణ్ కుహనా లౌకికవాదులు అంటూ దేశ లౌకిక తత్వాన్ని చివరకు రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించారన్నారు.

ఆరుగురు జూదరుల అరెస్ట్

నాగాయలంక: మండలంలోని ఏటిమొగ గ్రామంలో తుపాను రక్షిత భవనంలో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ కలిదిండి రాజేష్ శనివారం తెలిపారు. తమకు వచ్చిన సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి దాడి చేసి, వారి వద్ద నుంచి రూ.2100 నగదు, 53 పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నామన్నారు.

కూటమి వంద రోజుల పాలన ఘోర వైఫల్యం

పట్టభద్రుల ఓట్ల నమోదు అవగాహన సమావేశంలో గౌతమ్ రెడ్డి



పట్టభద్రుల ఓటరు నమోదు అవగాహన సమావేశంలో మాట్లాడుతున్న గౌతమ్‌రెడ్డి

పెడన: ఎన్డీయే కూటమి వంద రోజుల పరిపాలన ఘోరంగా విఫలమైందని వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గౌతమ్‌రెడ్డి అన్నారు. పెడన వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పాల రమేష్(రాము) అధ్యక్షతన పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణతో కార్మికులు రోడ్డెక్కి ఆందోళనలు చేస్తున్నారని తెలిపారు. పీజీ ప్రవేశంలో రిజర్వేషన్లు తొలగించడతో వైద్యులు ఆందోళనలు చేపట్టారని, వైద్య సీట్లు కోత, మెడికల్ కళాశాలలు రానీయకుండా అడ్డుకోవడం, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించకపోవడం వంటి అనేక వైఫల్యాలున్నాయన్నారు. విద్యార్థులకు రావాల్సిన ఫీజులు, అమ్మఒడి, విద్యాదీవెన, వసతి దీవెన వంటివి రాలేదన్నారు. చంద్రబాబునాయుడు తప్పిదం వల్లే విజయవాడ వరద ముంపునకు గురైందని గౌతమ్‌రెడ్డి దుయ్యబట్టారు. లడ్డూ విషయంలో అభాసుపాలయ్యారన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా : ఉప్పాల రాము

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పాల రాము మాట్లాడుతూ కార్యకర్తలకు, నాయకులకు ఎటువంటి ఆపద వచ్చినా అండగా ఉంటామని స్పష్టం చేశారు.పట్టభద్రుల ఓటరు నమోదుకు సమాచారం కావాలంటే 92913 89999లో సంప్రదించాల్సిందిగా సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బూరగడ్డ శ్రీకుమార్, ఎంపీపీలు సంగా మధుసూదనరావు, కూనసాని గరుడప్రసాద్, జెడ్పీటీసీలు సురేష్ రంగబాబు, రత్న కుమారి పాల్గొన్నారు.

ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్యలను పరిష్కరిస్తా

ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్



ప్రజల వద్ద నుంచి అర్జీలు తీసుకుంటున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

బంటుమిల్లి: ప్రజల వద్ద నుంచి వచ్చిన అర్జీలను విచారించి సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద శనివారం టీడీపీ మండల అధ్యక్షుడు కూనపరెడ్డి వీరబాబు అధ్యక్షతన ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల నుంచి అంతర్గత సీసీ రోడ్లు, డ్రైన్లు, విద్యుత్ స్తంభాలు, తాగునీటి సమస్యలపై అర్జీలు వచ్చాయి. రైతు వారీగా పంట కాలువలు, డ్రైన్లకు మరమ్మతులపై దాదాపు 41 అర్జీలు వచ్చాయి. ఇందులో భాగంగా ఎమ్మెల్యే కాగిత మాట్లాడుతూ ప్రజల వద్ద నుంచి వచ్చిన అర్జీలను శాఖలవారీగా పంపి అంచనాలు తయారు చేసి విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్లి నిధుల మంజూరుకు కృషి చేస్తానన్నారు. పలు సమస్యలను అక్కడే అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జనసేన పెడన నియోజకవర్గ సమన్వయకర్త పంచకర్ల సురేష్, సర్పంచ్‌లు ఆర్.గోపాలకృష్ణ, జి.బాలస్వామి, జె.కొండ, పి.కొండ, బి.కాశీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ సత్యనారాయణ, పలువురు అధికారులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



మృతిచెందిన అనంతలక్ష్మి

కృత్తివెన్ను: కృత్తివెన్ను ప్రధాన సెంటరులో 216 జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందిన ఘటన శనివారం మధ్యాహ్నం జరిగింది. స్థానికుల కథనం మేరకు మండలంలోని పీతలావ గ్రామానికి చెందిన వట్టికూటి ఆదినారాయణ, అనంతలక్ష్మి దంపతులు బంటుమిల్లి వైపు నుంచి మోటారుసైకిల్‌పై వస్తున్నారు. కృత్తివెన్ను ప్రధాన సెంటరు నుంచి తమ గ్రామం వైపు వెళ్లేందుకు రోడ్డు దాటే సమయంలో అటుగా వెళ్తున్న లారీ (బాక్సు) ఢీ కొట్టడంతో వారిరువురికీ తీవ్ర గాయాలయ్యాయి. మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్తుండగా అనంతలక్ష్మి (58) మరణించింది. తీవ్రగాయాలైన ఆదినారాయణకు చికిత్స అందిస్తున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

నాగాయలంక: మండలంలోని ఏటిమొగ గ్రామానికి చెందిన మహిళ మద్దుల లీలావతి, చిట్టా కామేశ్వరరావుల వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన 1250 కేజీల రేషన్ (పీడీఎస్)బియ్యం స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్.ఐ కలిదిండి రాజేష్ శనివారం తెలిపారు. లీలావతి ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యం 950 కేజీలు, కామేశ్వరరావు ఇంట్లో 300 కేజీల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఇరువురిని బియ్యంతో సహా స్టేషన్‌కు తీసుకువచ్చి కేసు నమోదు చేశామని ఎస్‌ఐ చెప్పారు.

దిండిలో 200 కేజీలు స్వాధీనం

మండలంలోని గణపేశ్వరం శివారు దిండి గ్రామానికి చెందిన దేవనబోయిన నాగబాబు అక్రమంగా నిల్వ ఉంచిన 200 కేజీల రేషన్ (పీడీఎస్) బియ్యం స్వాధీనం చేసుకుని, అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కలిదిండి రాజేష్ శనివారం చెప్పారు.

రాజరాజేశ్వరి అమ్మవారికి కంఠాభరణం వితరణ



అవనిగడ్డ: స్థానిక రాజరాజేశ్వరి అమ్మవారికి సీనియర్ న్యాయవాది వల్లభనేని రామారావు – కృష్ణకుమారి దంపతులు శనివారం రూ.1,12,900 విలువగల బంగారు కంఠాభరణంను అందజేశారు. తొలుత రామారావు దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఈ ఆభరణాన్ని ఆలయ ఈవో యార్లగడ్డ వాసుకు అందించారు. వేదపండితులు బంగారు ఆభరణాన్ని అమ్మవారికి అలంకరించారు. అనంతరం రామారావు దంపతులకు అర్చకులు ఆశీర్వచనాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ సింహాద్రి రామనాథబాబు పాల్గొన్నారు.

ఎస్‌వీఎల్ కళాశాలలో బతుకమ్మ పండుగ

అవనిగడ్డ: స్థానిక ఎస్‌వీఎల్ క్రాంతి జూనియర్ కళాశాలలో శనివారం దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, అధ్యాపకులు నూతన వస్త్రాలు ధరించి 14 రకాల పూలతో బతుకమ్మ చేశారు. అనంతరం అమ్మవారికి బోనాలు సమర్పించారు. కార్యక్రమాన్ని కళాశాల కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు, ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు పర్యవేక్షించారు.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరించిన స్వాతి



ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరిస్తున్న స్వాతి

చిలకలపూడి(మచిలీపట్నం): డివిజన్ పరిధిలో ఉన్న విషయాలపై అవగాహన చేసుకుని సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తానని ఆర్డీవో కె.స్వాతి అన్నారు. ఆర్డీవో కార్యాలయంలో శనివారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని మండలాల్లో పర్యటించిన అనంతరం అక్కడున్న సమస్యలను అవగాహన చేసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ముందుగా ఆమె కలెక్టర్ బాలాజీని మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.

మంత్ర ముగ్ధుల్ని చేస్తున్న తాళం భజన పోటీలు

భక్తి పారవశ్యంలో మునిగితేలిన భక్తులు



శ్రీకాకుళం కాళీకృష్ణ భజన సమాజం వారికి ప్రశంసా పత్రం, జ్ఞాపికను అందిస్తున్న కమిటీ సభ్యులు

చిట్టూర్పు(ఘంటసాల): దసరా ఉత్సవాల సందర్భంగా ఘంటసాల మండలం చిట్టూర్పు గ్రామంలోని శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో శివాలయం కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల స్థాయి తాళం భజన, మురళీ కోలాటం పోటీల్లో భాగంగా మూడవ రోజు శనివారం శ్రీ దివ్య సరస్వతి భజన సమాజం(పాత మాజేరు), శ్రీరామా భజన సమాజం(కొడాలి), శ్యామలా లలితా భజన సమాజం(పోలవరం), శ్రీ అయ్యప్ప భజన బృందం(లింగారెడ్డిపాలెం), శ్రీ రాజారామ భక్త మహిళా సమాజం(అమీనాపురం), కాళీ కృష్ణ భజన సమాజం(శ్రీకాకుళం) పాల్గొన్నాయి. పోటా పోటీగా ఆలపించిన భక్తి గీతాలతో ప్రజల్ని మంత్రముగ్ధుల్ని చేయగా భక్తులు భక్తి పారవశ్యంలో మునిగితేలారు. అనంతరం పోటీల్లో పాల్గొన్న భజన సమాజాల వారికి ప్రశంసా పత్రం, జ్ఞాపికలను వరప్రసాద్ అందించారు.

అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సహాయం

స్వచ్ఛందంగా నగదు సమకూర్చిన నక్కవానిదారి గ్రామ యువత



బాధిత కుటుంబానికి నగదును అందిస్తున్న నక్కవానిదారి గ్రామ యువత

కోడూరు: అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయి కట్టుబట్టలతో మిలిగిన కుటుంబానికి అండగా నిలిచేందుకు ఆ గ్రామ యువత ముందుకొచ్చారు. మండలంలోని లింగారెడ్డిపాలెం శివారు నక్కవానిదారి గ్రామానికి చెందిన పచ్చ వీరబాబు నివాస గృహం, పశువుల చావిడి అగ్ని ప్రమాదంలో కాలిపోయాయి. వీరబాబు రెక్కల కష్టం మీద కుటుంబాన్ని నెట్టుకొస్తుండగా, ఈ ప్రమాదంలో సర్వం కోల్పోయాడు. వీరబాబు పరిస్థితిని గమనించి గ్రామ యువత స్వచ్ఛందంగా ముందుకువచ్చి రూ.66 వేల నగదును సమకూర్చి వీరబాబు కుటుంబసభ్యులకు అందించారు. మండలానికి చెందిన టీడీపీ నేతలు రూ.20వేల నగదుతో పాటు 25 కేజీల బియ్యం, పండ్లు, సరుకులను అందించారు. జనసేన నేతలు బాధిత కుటుంబానికి నిత్యావసర సరుకులు, బియ్యం, కూరగాయలను అందించారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

నాగాయలంక: అనుమతులు లేకుండా అవనిగడ్డ మండలంలోని వేకనూరు గ్రామం నుంచి తలగడదీవి వైపు ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను శనివారం సాయంత్రం పట్టుకుని వాల్టా చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కలిదిండి రాజేష్ తెలిపారు. రేమాలవారిపాలెం వంతెన వద్ద మెయిన్ రోడ్డుపై ట్రాక్టర్‌ను ఆపి డ్రైవర్ కం ఓనర్ అయిన తుంగల వెంకన్నబాబు అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు. ఎలాంటి అనుమతులు చూపని కారణంగా వాహనాన్ని ఇసుకతో సహా స్టేషన్‌కు తరలించి వాల్టా కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు.

జగన్మాతా...నమో నమః !

శ్రీ దేశీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడోరోజు శనివారం మచిలీపట్నం, పెడన, అవనిగడ్డ నియోజకవర్గాల పరిధిలోని వివిధ దేవాలయాల్లో అమ్మవార్లను వివిధ రూపాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

–సాక్షి నెట్‌వర్క్



అన్నపూర్ణాదేవిగా కోడూరు గంగాభవానీ అమ్మవారు



మచిలీపట్నం మండలం ఎస్‌ఎన్ గొల్లపాలెంలో కుంకుమపూజ నిర్వహిస్తున్న సువాసినీలు



మచిలీపట్నం గీతామందిరంలో విజయలక్ష్మీదేవిగా...



నాగాయలంక కన్యకాంబ సన్నిధిలో శ్రీచక్ర సహిత కుంకుమార్చన



నాగాయలంక మండలం గణపేశ్వరంలో గాయత్రీదేవిగా



పెదకళ్లేపల్లిలో అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చిన దుర్గమ్మ



శ్రీకాకుళంలోని ముదిరాజుల రామాలయంలో



వేకనూరులో అన్నపూర్ణాదేవిగా



పెడన మండలం దావోజీపాలెంలో



బంటుమిల్లి కనకదుర్గ ఆలయంలో



కృత్తివెన్ను మండలం నీలిపూడిలో



తరకటూరులో అన్నపూర్ణాదేవిగా